క్లుప్తంగా

'రన్ ఫర్ జీసస్' నిర్వహణకు సన్నాహాలు


సమావేశంలో పాల్గొన్న దైవ సేవకులు

అడ్డతీగల: రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రన్ ఫర్ జీసస్ కో–ఆర్డినేటర్ పి.ఆరోగ్యరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక బెయిర్షబా ప్రేయర్ హౌస్‌లో పలువురు దైవసేవకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ఈస్టర్‌కు మధ్యలో వచ్చే పరిశుద్ధ శనివారం ఆరాధన ఛానల్ ద్వారా రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ప్రచారానికి కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. దైవసేవకులు రెవరెండ్ ఎ.రాజ్‌మార్, సియోనుబాబు, కె.జ్ఞానభూషణం, సిస్టర్ ఎం.ఎల్.ఇవాంజిలిన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ నీరజ

చింతపల్లి: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లంబసింగి పీహెచ్‌సీ వైద్యాధికారి నీరజ అన్నారు. మండలంలోని జాజులపాలెం బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. వార్డెన్ సీహెచ్.సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న ధ్యాన గురువు సుజాత

మునగపాక: ధ్యానంతో ఒత్తిడిని దూరం చేయవచ్చని, మంచి ఆరోగ్యం లభిస్తుందని ధ్యానగురువు సుజాత అన్నారు. మండలంలోని నాగులాపల్లిలోని చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో ఉన్న జీవ రాశులను ప్రేమించడం ద్వారా వాటి నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చన్నారు. ప్రకృతిని గౌరవించాలని సూచించారు.

నేడు వినాయక ఆలయ వార్షికోత్సవం

మునగపాక: స్థానిక పల్లపువీధిలో గల వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కోలాటం నిర్వహిస్తున్నామన్నారు.

దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి కృషి

నర్సీపట్నం: దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ సమగ్ర శిక్ష, పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల గుర్తింపు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విచ్చేసిన డిప్యూటీ డీఈవో మాట్లాడారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, వారి తల్లిదండ్రుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయ అధికారి శకుంతల మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా ఉపకరణాలు అందించడం కోసం గుర్తింపు నిర్ధారణ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉపకరణాలు అవసరమైన వారందరూ తప్పకుండా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఉపకరణాలు దైనందిన జీవితంలో తమ పనులు తాము చేసుకోవడానికి దోహద పడతాయన్నారు. వైద్య శిబిరంలో 67 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సాయిశైలజ, హెచ్‌ఎం డి.రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడి రైతు దిగాలు


మాడిపోతున్న జీడిపూత

- చల్లటి వాతావరణంతో మాడుతున్న జీడిమామిడి పూత
- గాలులకు రాలిపోయిన పిందెలు

కొయ్యూరు: జీడిరైతులు పంట పండాలంటే పూత నుంచి కాయలు వచ్చేంత వరకు వెచ్చదనం కావాలి. అలా ఉంటేనే రైతులకు లాభాలు వస్తాయి. అయితే వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో చల్లదనం పెరిగిపోయింది. ఈ కారణంగా పూత చాలా వరకు మాడిపోయింది. పిందెలు కూడా రాలిపోతున్నాయి. వెరసి జీడిరైతుల ఆందోళన వర్ణనాతీతంగా మారింది. తాజాగా రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో రైతులు మరింత దిగాలుగా ఉన్నారు. మండలంలో 32 వేల ఎకరాల్లో జీడితోటలు విస్తరించి ఉన్నాయి. రైతులు ఎక్కువ మంది ఆ తోటలపై ఆధారపడి జీవిస్తున్నారు.

విస్తారంగా జీడితోటలు

పాడేరు డివిజన్ 11 మండలాల్లో ఒక్క కొయ్యూరు ప్రాంతంలో మాత్రం వాతావరణం వేడిగా ఉంటుంది. దీంతో ఇక్కడ కాఫీ, మిరియాలు, అల్లం వంటి పంటలు పండవు. వేడి వాతావరణం కావడంతో 1970 దశకంలో మండలానికి అనువుగా ఉండే జీడితోటలను ఐటీడీఏ అధికారులు సరఫరా చేశారు. జీడిమామిడికి మార్కెట్ బాగుండడంతో ఏటా విస్తీర్ణం కూడా పెరుగుతుంది. మండలంలో విస్తారంగా జీడితోటలున్నాయి. జీడిపై ఆధారపడిన రైతులు సంఖ్య పెరుగుతుంది. అయితే వాతావరణంలో మార్పులు సంభవిస్తుండడంతో పూతతో పాటు పిందెలు కూడా మాడిపోతున్నాయి. దీని మూలంగా రైతులు నష్టాలు చూస్తున్నారు. వాతావరణం చల్లగా మారడంతో పూతపోయింది. పిందెలు రాలిపోయాయి. రైతులు ఈ పరిస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా బాపట్లకు చెందిన జీడి పరిశోధన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు వచ్చి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి, పూత కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిగుబడికి తీసుకోవాల్సిన సూచనలు అందిస్తుంటారు. అయితే ఈ సంవత్సరం రాలేదని రైతులు చెబుతున్నారు.పంచాయతీల పరిధిలో ఉన్న హార్టీకల్చర్ సహాయకులు సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

సూచనలివీ

జీడిమామిడి పూత నివారణకు ఆగ్రో గోల్డ్‌మ్యాక్స్ అనే మైక్రో న్యూట్రీన్‌ను ఒక ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని హార్టీకల్చర్ అధికారి కరుణ సూచించారు. దీంతో పూత చాలా వరకు నిలబడుతుందని తెలిపారు. సచివాలయాల్లోని హెచ్‌ఏలను క్షేత్రస్థాయిలో పర్యటించి, జీడితోటలను పరిశీలించి, రైతులకు సూచనలివ్వాలని తెలియజేశామన్నారు.

క్షయ నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి


హుకుంపేటలో అవగాహన ర్యాలీ చేస్తున్న డాక్టర్ అనూష, సిబ్బంది


రంపచోడవరం మండలం ఈతలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

హుకుంపేట: క్షయ నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి పూర్తిగా నివారించవచ్చని ఉప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని ఉప్ప కేంద్రంలో సిబ్బందితో కలిసి క్షయ వ్యాధి నివారణపై శుక్రవారం అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిపై గిరిజనులు భయాందోళన చెందవద్దని, ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. రెండు వారాలకు పైబడి దగ్గు, రాత్రి సమయంలో జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి సమాచారం అందించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సిబ్బంది సన్యాసిరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషి చేయాలి

రంపచోడవరం: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వై యూ కెన్ ఎండ్ టీబీ అనే నినాదంతో క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డాక్టర్ సుజిత అన్నారు. మండలంలోని నరాసపురం పీహెచ్‌సీ సిబ్బంది ఈతలపాడు గ్రామంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజిత మాట్లాడుతూ రెండు వారాలు పైబడి దగ్గు, జ్వరం, కళ్లెంలో రక్తం పడటం , బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. సీహెచ్‌వో అన్నపూర్ణ, నాగమణి, జోగమ్మ, సూపర్‌వైజర్లు గీతాంజలి, వంశీధర్, సత్తిబాబు ,ఏఎన్‌ఎం, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు.. తప్పని అవస్థలు

కొయ్యూరు: రెండు రోజులుగా బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పలుచోట్ల అండర్ గ్రౌండ్ కేబుళ్లు దెబ్బతినడంతో ఈ పరిస్థితి వస్తున్నట్టు పలువురు చెబుతున్నారు. మండలంలోని బ్యాంకులు, పోస్టాఫీసుతో పాటు అనేక ప్రభుత్వ కార్యాలయాలకు బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా సేవలు అందుతున్నాయని, కేబుళ్లు దెబ్బతినడంతో సేవలు స్తంభించడంతో బ్యాంకు లావాదేవీలు నిలిచిపోతున్నాయని చెబుతున్నారు. ఫలితంగా వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రైతులకు మేలు చేసిన వర్షం

బుచ్చెయ్యపేట: అకాలంగా కురిసిన వర్షం మండల రైతులకు మేలు చేసింది. గురువారం రాత్రి నుంచి వర్షం వర్షం కురిసింది. వేసవి ఉష్ణోగ్రతతో అల్లాడుతున్న ప్రజలకు అనుకోకుండా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి ఊరటనిచ్చింది. ఎండకు ఎండిపోతున్న చెరకు, మినప, పెసర, నువ్వులు, వేరుశనగ, సరుగుడు, జీడిమామిడి తదితర పంటలకు జీవం పోసింది. ఎండ తీవ్రతకు పచ్చగడ్డి లేక అల్లాడుతున్న జీవాలకు వర్షం ఎంతో మేలు చేసిందని పాడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పచ్చిక పుడుతుందని రైతులు తెలిపారు. వేసవి పొలం దుక్కులు దున్నుకోవడానికి, రబీ అపరాల సాగుకు మేలు చేసిందని చెబుతున్నారు.

వర్షాలకు తడిసిన మినప పంట

మాడుగుల రూరల్: బంగళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనంతో కురుస్తున్న వర్షం వల్ల అపరాలు పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షం వల్ల ఇటీవల పొలాల్లో తీసిన మినప, పెసర, పంట తడిసి ముద్దయింది. జనుము పంట పాక్షికంగా దెబ్బతింది. దాంతో పోలాల్లోనే టార్పాలిన్లు కప్పి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం తేలికపాటి వర్షం కురిసింది. ఈ వర్షం నువ్వు పంటకు అనుకూలంగా ఉందని రైతులు చెబుతున్నారు.

యోగాతో మహిళలకు మరింత ఆరోగ్యం

తుమ్మపాల : యోగా మహిళల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందని 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య అన్నారు. భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో గవరపాలెం మల్ల జగన్నాథం హాల్లో మహిళలకు ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా అనేక సమస్యలను నయం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఇంటిలోను యోగాసనాలు చేయడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. మహిళల్లో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు యోగా చక్కని పరిష్కారం చూపుతుందన్నారు. యోగా గురువు భీశెట్టి దొరమునాయుడు మాట్లాడుతూ పట్టణంలో జార్జి క్లబ్ వద్ద ఇప్పటికే యోగా కేంద్రం నిర్వహిస్తున్నామని, మహిళల కోసం మరో కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించినట్టు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా, అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవోలు ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోగా వయస్సు, స్థానిక వివాహిత మహిళ అభ్యర్థులు, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులుగా పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు అభ్యర్థుల కులము, నివాసం తదితర ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారిచే అటస్టేషన్ చేయించి జతపర్చాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 17 నుంచి 24వ తేదీ సాయంత్రం 5గంటలలోగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గాని పోస్టల్ ద్వారా గాని దరఖాస్తులు పంపవచ్చని తెలిపారు. అరకులోయ మండలంలోని మాదల పంచాయతీ చిట్టంగొందిలో అంగన్‌వాడీ కార్యకర్త, తుంగగెడ్డ, బ్యాంక్ కాలనీ, బస్కి పంచాయతీలో హెల్పర్, ఇరగాయి పంచాయతీ గాతపాడులో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నట్టు సీడీపీవో కె.శారద తెలిపారు.

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి పంచాయతీ, ఎస్.ఆర్.పురం పంచాయతీ పెదకోనెల, ఎగువశోభ పంచాయతీ కె.జామిగుడ, లంగుపర్తిలో నేలపాలెం, భీంపోల్‌లో చిమిడిపల్లి, టోకూరులో ములియగుడలో హెల్పర్, కొండిభలో మువ్వంవలస, టోకూరులో వై.కంబవలసలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో సంతోషకుమారి తెలిపారు.

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ బల్లకట్టు, కంద్రుం పంచాయతీ జోడిగుడలో ఆయా పోస్టు, కోల్లాపుట్టు పంచాయతీ చంపగుడలో మినీ అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సీలమ కోరారు.

హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు పంచాయతీ గంగుడి, కొట్నాపల్లి పంచాయతీ బి.బాకురు, తాడిపుట్టు పంచాయతీ యు.తాడిపుట్టులో మినీ అంగన్‌వాడీ, శోభకోట పంచాయతీ సుంద్రుపుట్టులో ఆయా, సంతారి పంచాయతీ, శోభకోట పంచాయతీలో సంపంగిపుట్టులో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో బాలచంద్రమణి దేవి పేర్కొన్నారు.

జి.మాడుగుల: మండలం గెమ్మెలి పంచాయతీ ఎగువ వీధిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, సొలభం పంచాయతీ ఎస్.పెదబయలులో ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో జి.సువర్ణమ్మ తెలిపారు.

అడ్డతీగల: మండలంలోని పులిగోగులపాడులో అంగన్‌వాడీ కార్యకర్త , బందమామిళ్లు, సోమన్నపాలెంలో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో వి.దీప్తి తెలిపారు.

మారేడుమిల్లి: మండలంలోని గుజ్జుమామిడివలస పంచాయతీ పరిధిలోని ఉత్తలూరులో మినీ అంగన్‌వాడీ కార్యకర్త , చావడికోట పంచాయతీ పరిధిలోని బోర్డ్లంకలో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో వి.ఎస్.ప్రసన్న తెలిపారు.

చింతూరు: మండలంలోని నర్సింహాపురంలో అంగన్‌వాడీ కార్యకర్త, బండిగుంపు, ఎంసీడీ క్యాంపు, కొండపల్లిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, గూడూరు, నర్సింగపేట, కారంగూడెంలో ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో విజయగౌరి ప్రకటనలో తెలిపారు.

గంగవరం: మండలంలోని మోహనాపురం పంచాయతీ మోహనాపురంలో అంగన్‌వాడీ కార్యకర్త, నూగుమామిడిలో హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో సీహెచ్.లక్ష్మి తెలిపారు.

రాజవొమ్మంగి: మండలంలోని సింగంపల్లిలో మినీ అంగన్‌వాడి కార్యకర్త, శరభవరంలో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో దేవమణి శుక్రవారం తెలిపారు.

కూనవరం: మండలంలోని టేకుబాక, టేకులొద్దిలో హెల్పర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విమల శుక్రవారం తెలిపారు.

వైఎస్సార్ ఆసరాపై విస్తృత అవగాహన


వైఎస్సార్ ఆసరాపై అవగాహన కల్పిస్తున్న ఎంఎంఎస్ అధ్యక్షురాలు పావని, వైస్ ఎంపీపీ గంగాదేవి తదితరులు

దేవీపట్నం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలోని 321 స్వయం సహాయక సంఘాలకు చెందిన 3114 మంది సభ్యులకు సుమారు రూ.1.27కోట్లు నిధులు ఈనెల 25వ తేదీన జమకానున్నట్టు వెలుగు ఏపీఎం సూరమ్మ తెలిపారు. వైఎస్సార్ ఆసరా పథకంపై శుక్రవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకూ లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి పథకం నిధులు విడుదలపై సమాచారం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఇందుకూరు పంచాయతీ ఎం.రావిలంక గ్రామంలో ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, ఎంపీడీవో కె.ఎస్.రత్నకుమారి , సర్పంచ్ కోసు లక్ష్మణ్, వెలుగు సిబ్బంది గడప గడపకు వెళ్లి ఆసరా పథకంపై అవగాహన కల్పించారు.

గంగవరం: మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం అమలుపై మహిళా సంఘాలకు, మహిళలకు అవగాహన కల్పించేందుకు మండల కేంద్రమైన గంగవరంలో ఎంఎంఎస్ సభ్యులు, వెలుగు సిబ్బంది ఇంటింటా సందర్శించారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శారపు పావని ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ కుంజం గంగాదేవి, ఎంఎంఎస్ ఏపీఎం శాంతిరాజు , మండల పరిషత్ పర్యవేక్షకులు సిద్దేశ్వరరావు తదితరులు గ్రామంలో పర్యటించి, మహిళలకు బొట్టుపెట్టి వైఎస్సార్ ఆసరా పథకంపై అవగాహన కల్పించారు. పొదుపు సంఘాల మహిళలను కలిసిన అనంతరం గ్రామస్థాయిలో గ్రామ సమాఖ్య సమావేశాలను నిర్వహిస్తామన్నారు. వెలుగు సీసీ విజయలక్ష్మి, వీఓలు టి.నాగమణి, గ్రామ సంఘం మహిళలు పాల్గొన్నారు.


ఎం. రావిలంకలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ సత్యవేణి

73 మందికి వైద్య పరీక్షలు


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోముదొర

జి.మాడుగుల: వాతావరణ మార్పుల వలన సంభవించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యపరమైన సమస్యలు వస్తే తక్షణ మే ఆస్పత్రి, వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఎఫ్‌పీసీ104 డాక్టర్ రొబ్బా సోముదొర తెలిపారు. మండలంలో సొలభం సచివాలయం–2 పరిధిలో గల గొందిపాడు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషి యన్ క్యాంపు(ఎఫ్‌పీసీ–104)జరిగింది. గ్రామా ల్లోని ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన వడిపోసి నీటిని తాగునీటిగా వినియోగించాలని ఆయన సూచించారు. ప్రజలకు ఆరోగ్య సలహాలను ఆయన తెలియజేశారు. గర్భిణులు, బీపీ, షుగర్ ఉన్న రోగులను ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వరంతో బాధపడే రోగులకు రక్త పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో వివిధ ఆరోగ్య పరమైన సమస్యలతో బాధపడే 73మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఆయన అందజేశారు. హెల్త్ సూపర్ వైజర్ ఆర్.వి.వి.సత్యనారాయ ణ హెల్త్ అసిస్టెంట్ మత్స్యరాస లక్ష్మీపతిరాజు, ఎంఎల్‌హెచ్‌పీ ఎల్.భాగ్యదీపిక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం


జి.మాడుగులలో వర్షంలో ఇంటర్ పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు


బురదగా మారిన చెరకుంపాలెం రహదారి

డుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి ఎరతెరపిలేని వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని అరకు వారపు సంతలో రైతులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

జి.మాడుగుల: వర్షం కారణంగా మండలంలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానిక గురుకులం కళాశాలలో ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు వర్షం వల్ల ఇబ్బందులు పడ్డారు. సుమారు 2 కిలోమీటర్ల కాలినడకన కేంద్రానికి వర్షంలో రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

కొయ్యూరు: మండల కేంద్రంలో గురువారం రాత్రి ఈదురుగాలులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చెట్టు నేలకూలింది.రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఈదురుగాలులతో పాటు పెద్ద శబ్దాలతో ఉరుములు ఉరిమాయి. దీంతో ప్రజలు పిడుగులు పడతాయని భయపడ్డారు.

రాజవొమ్మంగి: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో రాజవొమ్మంగి నుంచి చెరకుంపాలెం వరకు గల రహదారి చిత్తడిగా మారింది. దీంతో ద్విచక్రవాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఈ రూట్‌లో ఓ ఆర్టీసీ బస్సు బురదలో కూరుకుపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. చిత్తడి దారి వల్ల వాహనచోదకులు నానా ఇక్కట్లు పడ్డారు.


కొయ్యూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నేలకూలిన చెట్టు

ఆశాజనకంగా అపరాల దిగుబడి

రోలుగుంట: మండలం రైతాంగం సాగు చేసిన అపరాల దిగుబడి ఆశాజనకంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మండలంలో రోలుగుంట, కొమరవోలు, కొండపపాలెం తదితర గ్రామాల్లో 850 ఎకరాల్లో బొబ్బరి, మినప, పెసర తదితర పంటలను సాగు చేపట్టారు. ఖరీఫ్ వరి కోతలు తర్వాత ఆరుతడి పంటలుగా వేశారు. ఈ నేపథ్యంలో మంచు ప్రభావానికి ఏపుగా ఎదిగి ప్రస్తుతం బొట్ట దశకు చేరుకున్నాయి. రైతులు వీటి సేకరణ పనులు చేపట్టారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరా విస్తీర్ణంలో మినుమలు 50 కుంచాలు, పెసలు 80 కుంచాలు, బొబ్బర్లు 80 కుంచాలు దిగుబడులు వచ్చాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మినుములు, పెసలు కుంచం రూ.300, బొబ్బర్లు కుంచం రూ.250 ధర పలుకుతోంది. ఈ పంటలకు విత్తనాలు చల్లడం మినహా దుక్కులు చేయడం, నీటి తడులు పెట్టుకునే అవసరంగాని, కూలీల అవసరంగాని లేదు. పెట్టుబడి పోను ఇంటి ఖర్చులకు ఆదాయం సరిపోతుందని చెబుతున్నారు.


రోలుగుంటలో అపరాల సాగు

పల్లెల్లో కొత్త అమావాస్య సందడి


దేవవరంలో అమ్మవారి ఘటాలతో నృత్యం చేస్తున్న భక్తులు


ముస్తాబైన నూకాలమ్మ ఆలయం


కె.వెంకటాపురంలో గరగల ఊరేగింపులో గ్రామస్తులు

- ముస్తాబవుతున్న గ్రామదేవతల ఆలయాలు

నక్కపల్లి: గ్రామదేవతల పండగ సందడి మొదలైంది. నూకాలమ్మ, మరిడమ్మ, సత్తమ్మ, బంగారమ్మ, ఓరుగుంటాలమ్మ తదితర అమ్మవార్ల పండగలను ఏటా కొత్తఅమావాస్యకు 10 రోజుల ముందు నుంచి నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ప్రతిరూపాలుగా భావించే గరగలు, ఘటాలను గ్రామాల్లో ఊరేగిస్తున్నారు. మరికొంత మంది తమ ఇళ్ల వద్ద ఘటాలకు ప్రత్యేక పూజలు చేస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. నక్కపల్లి, ఉద్దండపురం, వేంపాడు, గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, దేవవరం, కాగిత, పాయకరావుపేట, మంగవరం, సత్యవరం, పెంటకోట సీతారామపురం, నామవరం తదితర గ్రామాల్లో డప్పు వాయిద్యాలు, నేల వేషాలతో ఘటాలను ఊరేగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో సందడివాతావరణం నెలకొంది. కొత్తఅమావాస్య ముందురోజు రాత్రి జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నక్కపల్లి, వేంపాడు, దేవవరం తదితర గ్రామాల్లో ఈ నూకాలమ్మ జాతర ఘనంగా జరుగుతుంది. అమ్మవారి పండగ కోసం ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

కోటవురట్ల: పల్లెల్లో కొత్త అమావాస్య పండగ సందడి మొదలైంది. పలు గ్రామాల్లో జాతరలు నిర్వహిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. కొత్త అమావాస్యకు ఐదు రోజుల ముందు నుంచి అమ్మవారి గరగలను ఊరేగిస్తారు. కె.వెంకటాపురం, కైలాసపట్నం, రామచంద్రపురం, కోటవురట్ల తదితర గ్రామాలలో గరగలను ఊరేగిస్తున్నారు. గ్రామస్తులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఎస్.రాయవరం: కొత్త అమావాస్య సందర్భంగా గ్రామాల్లో గరగలను ఊరేగిస్తున్నారు. డప్పుల వాయిద్యాలు, నృత్యాలతో గ్రామాలు సందడిగా మారాయి. కోనవానిపాలెం గ్రామంలో చిన్నారులు ,కోలాటం నిర్వహించారు.కొత్తపోలవరం వృద్ధుడి కర్రసాము అబ్బురపరిచింది.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషి మాత ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గోమాతకు పూజలు చేశారు. దాతల సహకారంతో మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.